శృంగార కథ

# తొలిపొద్దు - మలిసంధ్య

'జార్జి'

**"మనసున మనసై బతుకున బ్రతుకై / తోడొకరుండిన అదే భాగ్యము...అదే స్వర్గము..."**

**తెలివెన్నెల మబ్బు చాటేసుకుంది. హిమసుమాలు పుడమితల్లి సందిట్లో వాలిపోయి రాత్రిని కరిగిస్తున్నాయి. ఆ రేయి గడ్డకట్టిన తనువుని మునగదీసుకు పడుకుంది. పందిరికి అల్లుకున్న సన్నజాజితీగ తన సుగంధాల్ని విరజిమ్ముతూంది. మల్లెల సువాసనకి యవ్వనం పడగవిప్పి ఆడుతోంది.**

"నందినీ!"

"ఊ..." మత్తుగా మూలిగింది. పరువపు పందెంలో ఓడిపోయిన భీరువు మూలుగులాగా ఉంది.

రఘునంద్ చేయి ఆమె నడుంచుట్టూ పాములా మెలితిరిగింది. ఆమె కళ్లలో చీకట్లే ముసురుకున్నాయో, వెన్నెలలే అలుముకున్నాయో చూడటానికి వీలువడని గుడ్డివెలుతురు విద్యుద్దీపం.

"ఎన్ని నిద్రలేని రాత్రులిలా గడపడం!" అతడికళ్లలో క్రీనీడలు తచ్చాడాయి.

"ప్చ్..." అతడి నుదుటిన గాఢంగా చుంబించింది. ఆమె ఒళ్లు అగ్నిపర్వతపు సెగలు కక్కుతూంది.

"అయ్యో మొద్దబ్బాయ్! ఆమాత్రంకూడా తెలియదా? ఛ్చా...ఛ్చా...ఎన్ని రాత్రులా...ఆజన్మాంతం ఇలానే!" అతడి కంఠంలోయని మత్తుగా ఆమె పెదవులు. "యవ్వనాన్ని అరవిరిసిన పువ్వుతో ఎందుకు పోలుస్తారో తెలుసా?" అంది గోముగా బుగ్గగిల్లుతూ.

"ఎందుకో సెలవిస్తారా, దేవీ?" ఆమె పెదవులతో అతడి పెదవులు సరాగాలాడుకున్నాయి.

"యవ్వనం కూడా వాడిపోయే పువ్వులాంటిదని తెలియజెప్పడానికి!"

"అదుగో అదే...అదే నీలో నాకు నచ్చనిది. మాటల్లోపెట్టి రాత్రుల్ని కరగదీసే విద్య నీకెవరు నేర్పారోగానీ అబ్బా...వాళ్లపీక తెగ్గొయ్యాలి." అతడి మానసంలో కాంతికిరణం జీరాడింది.

"అబ్బాయిగారికి అంత తొందరయితే ఎలాగ...ఆకలయినప్పుడు అన్నం, యవ్వనంలో తోడు అందీ అందకుండా అందితేనే అద్భుతంగా ఉంటుంది."

"అబ్బ...ఆబ్రహ్మకయినా బుద్దం డక్కర్లా...అందాన్నంతా ఒకేమూసలో పోసి ఉక్కిరిబిక్కిరిచేయడానికి?"

"అబ్బాయిగారికి కవిత్వంకూడా వస్తోంది" అంటూ అతడిమీదికి ఒరిగిపోయిందామె.

ట్రాన్స్‌పరెంట్ నైటీనుండి ఆమె అంగాంగాల్లో తొణికిసలాడుతున్న యవ్వనాన్ని చూసి రాత్రికి కన్నుకుట్టింది. ఆమె వక్షద్వయం అతడిఛాతీని గట్టిగా అదుముతోంది. అతడిచేతులు అల్లరిగా కదులుతున్నాయి. ఆమె కళ్లు నిశ్శబ్దరాగాకృతుల్ని మీటుతూ అతడి కళ్లతో ఊసులాడుకుంటున్నాయి. ఆ కనురెప్పలు చుంబనపు తాకిడికి తట్టుకోలేక చలనంలేని తలుపుల్లా ముకుళించుకుపోయాయి.

ఆమె ఒంటినుండి అతడిఒంటికి విద్యుత్ పాకుతున్న అనుభూతి. అతడు మత్తుగా మూలిగాడు. ఆమె పురివిప్పి ఆడింది. అతడు ఆమెని ఇంకాఇంకా గాఢంగా అదుముకుంటున్నాడు. అంతలోనే ఆమెకి ఏదో గుర్తుకొచ్చినదానిలా నిశ్చలంగా ఆగిపోయింది



కొన్నిక్షణాలు. అంతే...చివాలున మంచం దిగి చకచకా ఆరుబయటికొచ్చింది. అతడు నిస్సహాయంగా మంచం దిగకుండానే ఉండిపోయాడు. అతడికళ్లని ప్రపంచాన్నే వణికించే నిర్లిప్తత వాటేసుకుంది.

'సీ...మిసెస్ నందినీ! నీ భర్తని జీవితాంతం సజీవంగా చూసుకోవాలనుకున్నట్లయితే నీ జీవితాన్ని బలిచేయకతప్పదు. ఆక్సిడెంట్‌లో అతని వెన్నెముకకి బలమైన దెబ్బ తగిలిన కారణంగా అతన్ని శాశ్వతంగా సెక్స్‌కి దూరంగా ఉంచక తప్పదు. ఏమాత్రం ఆవేశానికి గురైనా అతడి వెన్నెముక పూర్తిగా దెబ్బతింటుంది. ఆ తర్వాత నీ ఇష్టం. ఇది ఒక డాక్టరుగా హెచ్చరించడం లేదు. ఒక అన్నుడిగా చెపుతున్నాను. అయామ్ సారీ!' డాక్టర్ చందర్ మాటలు గుర్తుకొచ్చి ఆమె కనుకొలుకులనుండి కన్నీటిబిందువొకటి చెక్కిలిపై జారిపోయింది. నిస్స హాయంగా పందిరిగుంజకి ఒరిగిపోయింది. జరిగిన దారుణానికి సన్నజాజితీగ బిత్తరపోయి చూస్తోంది. ఆ శీతల వసంతయామిని బిక్కచచ్చిన కళ్లతో బేలగా చూస్తుండిపోయింది.

ఆరుబయటనుండి మెల్లగా లేచివచ్చి అతడితలని ఆప్యాయంగా తన ఒడిలోకి తీసుకొంది. అతడికళ్లు సజలాలయ్యాయని ఆమె చేతులు ఇట్టే పసిగట్టాయి.

"ఏయ్! ఏంటి చిన్నపిల్లాడిలా...తప్పుకదూ...ఇప్పుడు ఏంజరిగిందని?" అంటూ అతడిజుట్టులో వేళ్లుజొనిపి ఆప్యాయంగా అతడి తలనిమిరి, అతడి ఫాలభాగాన్ని వాంఛారహితంగా చుంబించి తనగుండెలకేసి గట్టిగా హత్తుకుంది.

నిశ్శబ్దం...నిశ్శబ్దం...నిశ్శబ్దం...

"ఇంకా ఏంజరగాలని! నందినీ...నా కోరిక తీరుస్తావా?" అతడికంఠం జీరపోయింది. అతడి మేను సన్నగా కంపించింది.

"ఊఁ...చెప్పు."

"కాదనవుగా..."

ఆమె తల అడ్డంగా ఆడించింది. అతడిగొంతులో ఉండకట్టుకు మిట్టాడుతున్న భావన. మనసులో కోరికకి ఊర్ధ్వంగా ఎగిసిపడాలన్న కోరిక.

"మన శోభనంరోజున తొలిసారిగా నేను విపరీతంగా సిగరెట్లు కాలుస్తుంటే నీవేమన్నావో గుర్తుందా? నా పెదవులమధ్య సిగరెట్టు అవతలకి విసిరికొట్టి 'మితంతప్పితే అమృతమైనా విషమౌతుం'దన్నావు. అదే విషయాన్ని ఇప్పుడు నీ సమస్యకీ అన్వయించి బాగా ఆలోచించే చెపుతున్నాను. త్యాగానికి సైతం ఒక హద్దుంటుంది. నాకోసం నీ యవ్వనాన్ని అడవికాచిన వెన్నెల చేయటం నాకిష్టం లేదు. నాగురించి ఎక్కువగా ఆలోచించి నీ జీవితాన్ని బలిచేసుకోకు. విధి ఆడే నాటకంలో కొన్నిజీవితాలు అర్థంతరంగా ఒక స్థానందగ్గిరే ఆగిపోతాయి. అదొక సున్నాలాటిది. ఎక్కడినుండి మొదలుపెట్టినా, ఎక్కడ మొదలుపెట్టినా ఆ రేఖ తనచుట్టే తిరుగుతుంది. సో...నువ్వు మరోపెళ్లి చేసుకో..."

ఆమెచేయి అతడి పెదవుల్ని గట్టిగా మూసింది. "వద్దండి...దయచేసి మరోసారి అలా అనకండి. యవ్వనం ఒక మరీచిక...అదొక ఎండమావిలాటిది. అది ఎన్నోరోజులు శాశ్వతంగా నిలవదు. ఆపైన చాలారోజులు బతకాల్సుంటుంది. మిమ్మల్ని కాదని మరొకరితో ఈ జీవితాన్ని గడపడం బహుశా ఈజన్మకి సాధ్యం కాదు. మనసున మనసై, బతుకున బ్రతుకై దొరికిన తోడుని ఏ ఆడదీ కామంకొరకు జారవిడుచుకోదు. మనసు మాసిపోతే శృంగారానికి, వ్యభిచారానికి తేడా లేదు. తే...డా...లే...దు."

అతడు ఆమె ఒడిలో పసివాడుగా ఒదిగిపోయాడు.

పొగిలిపోయిన జీవనభాండంనుండి వాడిపోయిన కలహంస ఒకటి ఆమెపెదవులనుండి వెలికుబికింది.

చీకటి పక్కదులిపేసుకుంది.

వేకువ తూరుపుకడుపున పురుడోసుకుంది.

